క్లుప్తంగా

మెరుగైన వైద్య సేవలు అందించండి

నేలకొండపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండలంలోని బోదులబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి పేషంట్లతో మాట్లాడి సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామచంద్రాపురంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను సందర్శించి హాజరు శాతం పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, వైద్యాధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంక్రైం: పోలీస్ శాఖ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్ మెమోరియల్ హైస్కూల్(కేపీఎంహెచ్‌ఎస్)లో సాంఘిక శాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ నిష్టా శర్మ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ దరఖాస్తులను kpmhskmm@gmail.comకు ఈనెల 18లోగా పంపించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94405 25093లో సంప్రదించాలని సూచించారు.

సన్మానం



కిషోర్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని గొల్లగూడెంకు చెందిన మడకంటి కిషోర్‌రెడ్డి ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న అనంతరం తొలిసారిగా గ్రామానికి బుధవారం రాగా.. గ్రామస్తులు, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలంగా వాయుసేనలో ఉన్నత పదవులు అధిరోహించి నావల్ ఎయిర్ ఆర్మ్‌గా, కమిషన్ ఆఫీసర్‌గా ఎదిగి ఉత్తమ సుప్రీం కమాండర్‌గా అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీను, బీజేపీ నాయకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నింటా బెస్ట్..



ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల



ఫలితాలే లక్ష్యంగా..

ఫలితాలు, ప్రవేశాల్లో ఏఎస్‌ఆర్ శాంతినగర్ కళాశాల మేటి

- కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన
- ప్రతీ విద్యార్థిపై నిరంతర పర్యవేక్షణ
- బోధనకు తోడు కల్చరల్ ప్రోగ్రామ్స్
- ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కల్పిస్తున్న సౌకర్యాలతో సత్ఫలితాలు సాధిస్తున్నాయని చెప్పొచ్చు. నగరంలోని మూడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా.. వాటిలో నగరంలోని ఏఎస్‌ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ అడ్మిషన్లు, ఫలితాల్లోనూ మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా.. ఫలితాల్లో సైతం రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటుంది. ఇంటర్ విద్యతో పాటు ఎప్‌సెట్, నీట్ శిక్షణను సైతం అందిస్తున్నారు. కళాశాలలో సరైన సౌకర్యాలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కృషితోనే ఈ ఫలితాలు వస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రవేశాలు ఇలా..

కళాశాలలో ప్రవేశాల పెంపునకు అధ్యాపక, అధ్యాపక సిబ్బంది ప్రతీ ఏడా ది ఓ ప్రణాళిక ప్రకారం ఫిబ్రవరి, మార్చి నెల నుంచే అడ్మిషన్ల వేటలో పడతారు. నగరంతో పాటు సమీప మండలాల్లోని గ్రామాల్లో ప్రభు త్వ పాఠశాలలు, పదో తరగతి విద్యార్థుల వద్ద కు వెళ్లి కళాశాల ఫలితాలు, సౌకర్యాలపై అవగాహన కల్పిస్తారు. ఇదే విద్యార్థుల సంఖ్య పెంపునకు దోహదపడినట్లుగా అధ్యాపకులు చెబుతున్నారు.

ఫలితాలే లక్ష్యంగా..

సుమారు ఆరేళ్ల క్రితం వివిధ సౌకర్యాలతో ముస్తాబైన ఏఎస్‌ఆర్ శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. నాటి నుంచి అడ్మిషన్ల పెంపుతో పాటు ప్రవేశాల సైతం భారీగా పెరుగుతుండడం, ఫలితాలు సైతం రాష్ట్రస్థాయిలో వస్తుండడంతో విద్యార్థులు సైతం దీనిపై ఆసక్తి చూపిస్తున్నారు. గత రెండేళ్లుగా జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో టాప్ మార్కులు సాధిస్తూ.. ప్రతిభ కనబర్చారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారించి బోధన అందిస్తుండడంతో ఫలితాలు వస్తున్నాయి.

పలువురి సహకారం..

ఇదే సమయాన స్థానికంగా ప్రజాప్రతినిధులు, ఇతర అధికారుల నుంచి వస్తున్న సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడేలా కళాశాల యాజమాన్యం పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రతీ విద్యార్థికి చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన, వ్యాసరచన, వక్తృత్వ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నారు. ప్రతీ విద్యార్థి కళాశాలకు వచ్చేలా వారి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నారు.

టాప్ వీరే..

2024–25 విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయిలో టాప్ మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో జి.సాయి నీరజ్ 1000 మార్కులకు 985, వి.సింధు 972, కుసుమ వైష్ణవి 981మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం లో సైతం ఎస్‌కె.షాహిద్ 470కి 466 మార్కులు, ఆర్.కార్తీక్ రెడ్డి 464, సీఈసీ విభాగంలో కె.పావని 500కి 475మార్కులు సాధించారు.

ఫలితాలిలా.. ● ప్రథమ ● ద్వితీయ

సంవత్సరం	ప్రవేశాలు	ఉత్తీర్ణులు	ఉత్తీర్ణత శాతం
2022-23	336	196	58.3
	211	158	74.8
2023-24	330	195	59
	278	194	69.7
2024-25	334	242	72.45
	254	217	85.4
2025-26	425	-	-
	350	-	-

కార్పొరేటుకు దీటుగా..



అనుభవం కలిగిన అధ్యాపకులతో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా నీట్ క్లాసులు ప్రత్యేకంగా నిర్వహించడంతో ఈ కళాశాలను ఎంచుకున్నారు. ఆశించిన స్థాయి కంటే మెరుగ్గా విద్యా బోధన జరగడం సంతృప్తికరంగా అనిపిస్తుంది. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో జిల్లా నుంచి తృతీయ బహుమతి సాధించా.

– సమీర్ పాషా, బైపీసీ ప్రథమ సంవత్సరం

విద్యకు ప్రాధాన్యత..



కళాశాలలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థులకు మానసికోల్లాసం కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంప్రదాయ పండుగలు, వ్యాసరచన పోటీలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహించడం ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధనకు కృషి చేస్తున్నా.

– తూముల వందన, ఎంపీసీ ప్రథమ సంవత్సరం

నాణ్యమైన విద్యతో సత్ఫలితాలు



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోనే సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయి. కల్చరల్ ప్రోగ్రామ్స్‌తో పాటు ప్రతీ విద్యార్థిపై నిరంతర పర్యవేక్షణలో చదువుపై ఆసక్తి పెంచేలా చూస్తున్నాం. ఎప్‌సెట్, నీట్ శిక్షణ సైతం అందిస్తున్నాం. అధికారులు, కళాశాల సిబ్బంది సహకారంతోనే రాష్ట్రస్థాయి ఫలితాలు సాధిస్తున్నాం.

– గోవిందరావు, ప్రిన్సిపాల్

బీసీ బిల్లును కేంద్రం ఆమోదించాలి



ఖమ్మంమయూరిసెంటర్: నిరసనలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ నుంచి పంపిన 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుడు శింగు నర్సింహారావు , సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం బీసీ హక్కుల సాధన సమితి నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిరసన తెలిపారు. అలాగే స్థానిక సుందరయ్య భవనంలో సుదర్శన్, నాగేశ్వరరావు, ఖమ్మం అంబేద్కర్ భవనంలో ఎస్.శ్రీనివాస్, జిల్లా కార్యాలయంలో కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపై కేంద్రం రాజకీయ ఆటలు ఆడుతుందని, సామాజిక న్యాయం కోసం, పేద, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం అవసరమైన ఈ రిజర్వేషన్లను అడ్డుకోవడం బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్య అన్నారు. రిజర్వేషన్ల సాధనకు ఈ నెల 18న జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వివిధ సంఘాలు, పార్టీ నేతలు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి, బండి రమేష్, వై విక్రమ్, బొంతు రాంబాబు, కృష్ణమాచారి ,మధు గౌడ్ ,పిండిప్రోలు రామమూర్తి, దుపెల్లి శ్రీను, పడిశాల వెంకన్న, మునగలేటి వీరస్వామి, బొడ్డు వెంకయ్యబాబు, తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణ టీకాలు ప్రారంభం



కూసుమంచి: టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నీలకాంత్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆయా మండలాల్లో పశు వైద్యాధికారులు, నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 15 వరకు గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాజీ వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్

సంక్షిప్త సమాచారం..

రేపు 'ఎకో బజార్'..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీన ఎకో బజార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బానోత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ గ్రీన్ కోర్ కార్యక్రమానికి తమ కళాశాల ఎంపిక కావడంతో విద్యార్థినులు ఆహార పదార్థాలు, అలంకరణ వస్తువులు, పూజా సామగ్రి వంటివి ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



చెక్కు అందిస్తున్న ఆర్డీఓ నర్సింహారావు

ఖమ్మం సహకారనగర్: కొణిజర్లకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి షఫీకు చదువు నిమిత్తం పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యాన అందించిన రూ.20వేల చెక్కును ఖమ్మంలో ఆర్డీఓ జి.నర్సింహారావు బుధవారం అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్యను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు లక్ష్మయ్య, కోట్యా, విద్యార్థి తండ్రి రజాక్‌మియా తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీ పుస్తకాల కోసం రూ.20 వేలు..

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి జీపీ అబ్బాసుపురం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ధరావత్ మోహన్‌నాయక్ మండలంలోని పాన్యేకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైబ్రరీలో పుస్తకాల కొనుగోలు నిమిత్తం రూ.20 వేల నగదు హెచ్‌ఎం కోటేశ్వరమ్మకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో చదువుతోనే మంచి గుర్తింపు ఉంటుందని, ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ఎదగాలని ఆకాంక్షించారు.

25 నుంచి ధాన్యం కొనుగోళ్లు..

నేలకొండపల్లి: పాలేరులో మొత్తం 53 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.సతీష్ తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం కొనుగోలు కేంద్రాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ఏఈఓలు దుర్గాభవాని, ఈశ్వరి, శిరీష, అరవింద్, అవినాష్, సొసైటీ సీఈఓలు, గ్రామదీపికలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండ గ్రామ పంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైఆర్‌జీకేర్ సంయుక్త ఆధ్వర్యాన బుధవారం హెచ్‌ఐవీ /ఎయిడ్స్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్ నందిని, లింక్ వర్కర్ నాగేంద్రలు మాట్లాడుతూ.. 18ఏళ్లు పైబడిన వారందరూ సమీప ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీసీ కేంద్రాల్లో లభించే ఉచిత ఔషధాలు నిరంతరం వాడాలని సూచించారు. గ్రామ సెక్రటరీ, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్, లింక్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నగర సమస్యలపై బీజేపీ సర్వే

ఖమ్మం మామిళ్లగూడెం: నగర సమస్యలపై బీజేపీ టూటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణ ఆధ్వర్యాన బుధవారం టూటౌన్ పరిధిలోని 10, 11వ డివిజన్‌లో నాయకులు పర్యటించారు. తొలుత 10వ డివిజన్ పర్ణశాల రామాలయంలో పూజలు చేశారు. 10, 11వ డివిజన్ల శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు యుగేందర్ , శ్రీనివాసచార్యులు, మాధవ్, కృష్ణచారి, సుధాకర్, మహేందర్, భూక్య వెంకట్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ మృతి

కూసుమంచి: కూసుమంచికి చెందిన కొంగర పుల్లయ్య(58) బుధవారం ఉపాధి కూలీ పనులకు వెళ్లివస్తూ మృతి చెందాడు. ఉదయాన పనికి వెళ్లిన ఆయన మధ్యాహ్నం ఇంటికి వస్తుండగా.. మార్గమధ్యలో పాఠశాల సమీపాన ఒక్కసారిగా కుప్పకూయాడు. దీంతో స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరించాడు. పుల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న మేళ్లచెర్వు ప్యానెల్ సభ్యులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల బరిలో నిలిచే మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు ప్యానల్, మద్దతుదారులు బుధవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ప్రచారం నిర్వహించారు. పోటీలో ప్యానెల్‌గా బరిలో అధ్యక్షుడిగా మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా జీ.వై.నరేష్, ఉపాధ్యక్షుడిగా బత్తిని నర్సింహారావు, సహాయ కార్యదర్శిగా ముత్యం ఉప్పల్‌రావు, కోశాధికారిగా తల్లాడ రమేష్‌లతో పాటు ఇతర శాఖలో పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేశారు. ఈ ప్యానెల్‌కు మద్దతుగా చాంబర్ ప్రస్తుత ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతులు

➡ గురుకుల సమస్యలపై..

ఖమ్మం మామిళ్లగూడెం: సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న గురుకుల పాఠశాలలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు వసతితో పాటు నాణ్యమైన విద్యకు ఏటా రూ.కోట్లు ఖర్చు పెడుతున్నా పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, మరుగుదొడ్లు, తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు షేక్.నాగుల్ మీరా, జిల్లా నాయకులు సాయి, గోపి, వలి తదితరులు పాల్గొన్నారు.

➡ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై..



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

రిటైర్డ్ ఉద్యోగుల గత 18 నెలల జీపీఎఫ్, గ్రాడ్యుటీ, సరెండర్ లీవ్ తదితర ఆర్థిక బకాయిలు విడుదల చేయించాలని కోరుతూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యాన బుధవారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేసింది. తొలుత కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, నాయకులు కృష్ణయ్య, సుబ్బయ్య, వెంకటపతి రాజు, కృష్ణమోహన్, టి.జనార్ధన్, డి.కే.శర్మ, సాంబశివరావు, మొయినుద్దీన్, రాజారావు, కృష్ణమూర్తి, బాబురావు, వెంకటనారాయణ, బసవరావ్, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, హనుమంతరావు, రమేష్, రమణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

➡ లింగనిర్ధారణ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో లింగనిర్ధారణ చేసే ప్రైవేట్ ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం పీఓడబ్ల్యూ ఆధ్వర్యాన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.శిరోమణి మాట్లాడుతూ.. అధికారుల ఉదాసీనత వలన ఆస్పత్రుల నిర్వాహకులు తమ పలుకుబడిని వినియోగించుకుని మరల వాటిని తెరుస్తున్నారని, అటువంటి ఆస్పత్రులను శాశ్వతంగా మూసివేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, జిల్లా నాయకులు బండెల లలిత, గోకినపల్లి సరోజిని, ఉమా, లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం సంగబత్తుల సుమన్ రెడ్డి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 45 మంది అభిమానులు తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వనవాసం నరేందర్‌రెడ్డి, నాయకులు పొట్ల కిరణ్, మంగీలాల్, వొర వెంకటేశ్వర్లు, సుమన్‌రెడ్డి, ఇబ్రాయిల్, ఉన్నం రాజశేఖర్, రాంరెడ్డి, బత్తుల వెంకటనారాయణ, భూక్యా వీరన్న, మోరపాక నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పడాలి

నేలకొండపల్లి: మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులు ఫ్యాక్టరీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య పేర్కొన్నారు. ఫ్యాక్టరీలో తన చాంబర్‌లో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ ఏడాది సీజన్‌లో చెరుకు టన్నుకు అన్ని రాయితీలు కలుపుకుని రూ.3,758లను అందించనున్నామని, డిసెంబర్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అధిక దిగుబడి సాధించిన రైతులకు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఫ్యాక్టరీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కోటయ్య, కేన్ డీజీఎం (ఫైనాన్స్) వెంకటేశ్వర్లు, కేన్ డీజీఎం అప్పారావు, హెచ్‌ఆర్ నరేష్, రైతు ప్రతినిధులు భద్రయ్య, సూరపనేని రామకృష్ణ, రచ్చా నరసింహారావు, బోనగిరి కిరణ్, దండా రంగయ్య పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

➡ ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య పనులు



రాపర్తినగర్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ప్రధాన, అంతర్గత రోడ్లను ప్రణాళిక ప్రకారం శుభ్రం చేయాలని మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని పారిశుద్ధ్య పనులు, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. రోడ్ల వెంట ఎక్కడ చెత్త కనిపించినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డు, రాపర్తినగర్ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మేయర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తిశరత్, మేడారపు వెంకటేశ్వర్లు, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య పాల్గొన్నారు.

➡ రూ.19 వేల జరిమానా..

నగరంలోని పలు దుకాణాలు, కర్రీ పాయింట్లు, వైన్స్‌లో శానిటేషన్ అధికారులు తనిఖీ చేసి 10 కిలోల నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకుని రెండు వైన్స్‌లకు రూ.3 వేల చొప్పున, కర్రీ పాయింట్‌కు రూ.2 వేలు, హాట్ చిప్స్ నిర్వాహకులకు రూ.2 వేల జరిమానా విధించారు. ఇక రోడ్డుపై డ్రెయినేజీ వాటర్ వదిలిన వారికి రూ.5 వేలు, ఖాళీ స్థల యజమానికి రూ.3 వేలు జరిమానా విధించినట్లు శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య తెలిపారు.

➡ డిపాజిట్ నగదు తగ్గించాలి..

నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో కేఎంసీ అధికారులు నిర్ణయించిన రూ.10 వేల డిపాజిట్‌ను తగ్గించాలని వీధి వ్యాపారులు కోరుతున్నారు. బుధవారం వీధి వ్యాపారులు కమిషనర్‌ను కలిసి తమ సమస్యను విన్నవించుకుని డిపాజిట్‌పై పునరాలోచన చేయాలన్నారు. కొంత మంది చర్యల వల్ల తాము మళ్లీ రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



సృజనను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జి.సృజన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో నేడు(గురువారం) అండర్ 14 విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో ఆమె పాల్గొననుండగా.. బుధవారం పాఠశాలలో హెచ్‌ఎం వి.జ్యోతితో పాటు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

జాతీయ స్కేటింగ్ పోటీలకు 'స్మార్ట్ కిడ్జ్' విద్యార్థిని..



విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్ కృష్ణచైతన్య

ఖమ్మం సహకారనగర్: స్థానిక స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో ఒకటో తరగతి విద్యార్థిని పసుపులేటి వీక్ష జాతీయస్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్–2025 రాష్ట్ర స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో 400 మీటర్లు, 600 మీటర్ల విభాగంలో పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈమేరకు బుధవారం పాఠశాలలో ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి బ్లూమింగ్ మైండ్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఖమ్మం అర్బన్ మండల నార్త్ లెవెల్ క్రీడలను మండల విద్యాశాఖాధికారి(ఎంఈఓ) శైలజాలక్ష్మి, కన్వీనర్ అశోక్‌రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, పాఠశాల యాజమాన్యం క్రీడలకు ఆతిథ్యమివ్వడం అభినందనీయమన్నారు. గురువారం బాలురకు అండర్–14, అండర్–17 విభాగాల క్రీడలు నిర్వహించనున్నట్లు మండల క్రీడల హెచ్‌ఎఫ్ కార్యదర్శి బియ్యని కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు నాగప్రసాద్, నాగుల్ మీరా, రోజా, విజయకుమారి, సంపత్, బిక్కన్, రాము తదితరులు పాల్గొన్నారు.

డెంటల్ చైర్ మంజూరు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు బుధవారం సుమారు రూ.1.5లక్షల విలువైన డెంటల్ చైర్ మంజూరైంది. ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆస్పత్రికి రాగా.. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృపాఉషశ్రీ పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో డెంటల్ చైర్‌తో పాటు స్కానింగ్ మిషన్, ఎక్స్‌రే యూనిట్‌ల ఏర్పాటుకు సంబంధించిన పరికరాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ మేరకు చైర్ మంజూరు కాగా ఇక నుంచి దంతవైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

విజయవంతం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: పీడీఎస్‌యూ స్థాపించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 23న ఖమ్మంలో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు జె.గణేష్ కోరారు. బుధవారం ఖమ్మంలోని విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సంఘం ప్రధాన భూమిక పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాజేష్, గోపీచంద్, నవ్య, సుస్మిత, విజయ్ పాల్గొన్నారు.

ఎన్నికలు వెంటనే జరపాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే జరపాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలను అజెండాగా పార్టీ ముందుకెళ్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 గ్రామపంచాయతీల్లో 50 ఎంపీటీసీ, 20 జెడ్పీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, నాయకులు తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు, వెంకన్న, నవీన్, సత్యం, మధు, సరోజన, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకం

నిరుపేద కుటుంబంలో జన్మించి.. చివరి శ్వాస వరకు సచ్ఛీలుడిగా మిగిలిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయుడిగా, అధ్యాపకుడిగా, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంమయూరిసెంటర్: ముస్తఫానగర్‌లో నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ మక్బూల్, ప్రజా సంఘాల నేతలు



రఘునాథపాలెం: జ్యోతిబా పూలే మహిళా డిగ్రీ కళాశాలలో..



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు